
దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


పార్టీ శ్రేణులతో నామినేషన్ వేయడానికి వెళ్తున్న బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి

# కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచా..

- మీ ఆడబిడ్డలా ఆశీర్వదించండి
- అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసుకుందాం..
- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి
- నామినేషన్ దాఖలు చేసిన పద్మాదేవేందర్‌రెడ్డి
- మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ప్రజల నీరాజనం


ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తరఫున రెండో సెట్‌ను వేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఆడబిడ్డలా తనను మరోసారి ఆశీర్వదించాలని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ తరఫున నామినేషన్ వేయనున్న సందర్భంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి స్వగ్రామం రామాయంపేట మండలం కోనాపూర్ పోచమ్మ ఆలయంలో, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గాభవానీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెదక్ రిటర్నింగ్ కార్యాలయంలో రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో నామినేషన్ వేసినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మెదక్ నియోజకవర్గం ప్రజలు తనకు చేదోడు వాదోడుగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి ఆశీస్సులతో జిల్లా హెడ్‌క్వార్టర్ అయ్యిందన్నారు. వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సాగునీటి కోసం ఎంఎన్ కెనాల్, ఎఫ్ఎన్ కెనాల్‌కు లైనింగ్ చేసి పంట పొలాలకు సాగునీరు అందించామన్నారు. మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఎన్నో ఏండ్ల నుంచి కలగానే మిగిలిపోతాయనుకున్న కార్యక్రమాలు మెదక్ కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, రైల్వే, మెడికల్ కళాశాలను ఏడు సంవత్సరాల్లో తీసుకొచ్చామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ఆడబిడ్డలాగా ఆశీర్వదిస్తున్నారని, ప్రజల దగ్గర నుంచి మంచి స్పందన వస్తున్నదన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని ప్రజల ఆశీస్సులతో అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తరఫున మరో నామినేషన్ సెట్‌ను మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, నాయకులతో కలిసి మెదక్ రిటర్నింగ్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, చెల్ల సుధాకర్, జావిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ కార్యాలయం వద్ద సందడి

మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మెదక్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు చంద్రపాల్, జితేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఎంపీపీ నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీంతో బీఆర్ఎస్ కార్యాలయం సందడిగా మారింది. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రతి ఎన్నికల్లోనూ సెంటిమెంట్‌గా రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలోని పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం గ్రామస్తుల మధ్య నామినేషన్ ఫారాన్ని నింపి మెదక్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేశారు.

### దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాపన్నపేట, నవంబర్7: ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా నామినేషన్ వేయడానికి ముందు ఆమె దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ సందర్భంగా వేద పండితులు ఆమె పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ సత్తెల్లి బాలాగౌడ్ ఆమెకు సన్మానించారు. ఎమ్మెల్యే వెంట ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుమ్మరి జగన్, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ధర్మకర్తలు మనోహర్, మోహన్‌రావు, నాగ్సాన్‌పల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్, సాయిరెడ్డి, సామ్యూల్ తదితరులు ఉన్నారు.

## ప్రజలే నా బలం.. బలగం


- నామినేషన్‌కు వెళ్లే ముందు కోనాపూర్ గ్రామస్తులతో పద్మాదేవేందర్‌రెడ్డి


గ్రామస్తులతో మాట్లాడుతున్న పద్మారెడ్డి

రామాయంపేట రూరల్, నవంబర్7: మెదక్ నియోజకవర్గ ప్రజలే నా బలం బలగం, మిమ్మల్ని నమ్మి మరోసారి ముందుకెళ్తున్నా.. అని బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసే ముందు స్వగ్రామం రామాయంపేట మండలంలోని కోనాపూర్ గ్రామంలో కుటుంబీకుల ఆశీర్వాదంతో పాటు గ్రామంలో పోచమ్మ దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గం నుంచి 21 ఏండ్లుగా రాణించడానికి కోనాపూర్ ప్రజలే కారణమన్నారు. గ్రామ కోడలిని అయినప్పటికీ తనను ఇంటింటా ఆడపడుచులాగా ఆదరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈసారి కూడా తనను ఎప్పటిలాగే ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఆమెతో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ దోమ చంద్రకళ, ఎంపీపీ నార్సింపేట భిక్షపతి, రామాయంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, నాయకులు దోమ ఇమానియేల్ తదితరులు ఉన్నారు.

# కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమా

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవు
- రైతు రుణమాఫీని అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీయే
- తండాలను పంచాయతీలుగా మార్చింది సీఎం కేసీఆరే..
- నియోజకవర్గంలోని మంజీరా నదిలో 14 చెక్‌డ్యాంలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి
- చిట్కుల్ శివారులో నిర్మించిన చెక్‌డ్యాం చరిత్రలో ఉంటుంది
- 24 కరెంట్ కావాలాంటే కారు గుర్తుకు ఓటేయాలి
- ఆడబిడ్డగా ఆశీర్వాదించండి: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


చిట్కుల్ చాముండేశ్వరీ ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి


సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

చిలిపిచెడ్, నవంబర్ 7: బీఆర్ఎస్ అధికారంలో వస్తే తెల్లరేషన్ కార్డు ఉన్న ఇంటింటికీ కేసీఆర్ బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో ఉన్న చాముండేశ్వరీ ఆలయంలో అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని చిట్కుల్, బద్రియ తండా, గుజిరి తండా, గౌతాపూర్, టోప్యితండా, గన్య తండా, చండూర్, చిలిపిచెడ్, శీలాంపల్లి, సోమక్కపేట, రాందాస్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిట్కుల్, బంద్రియ తండా, గౌతాపూర్ తదితర గ్రామాల్లో వారికి ప్రజలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. బ్యాండ్ బాజా, డప్పుచప్పుళ్లతో ఆటపాటలతో, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నినాదాలు, ర్యాలీల మధ్య ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మీ ఆడబిడ్డగా నన్ను ఆశీర్వాదిస్తే ఎమ్మెల్యే అన్న మదన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే అసైన్డ్ భూములపై రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. అధికారంలోకి రాగానే మహిళలకు సౌభాగ్యలక్ష్మి అందిస్తామని చెప్పారు.


సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి బద్రియ తండాలో స్వాగతం తెలుపుతున్న గిరిజనులు

### కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కర్ణాటకలా కరెంట్ గోస పడాల్సిందేనని, ప్రజలారా మీ ఓటు రైతుబంధుకు వేస్తారో లేదా రాబంధులకు వేస్తారో ఆలోచించండని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. చిలిపిచెడ్ మండలంలో ఎన్నిక ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ కల్లబొల్లి మాటలు నమ్మొద్దన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. మంజీరా నదిలో 14 చెక్‌డ్యాంలు నిర్మించిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. చిలిపిచెడ్ మం డలం మంజీరా నదిలో అజ్జమర్రి, ఫైజాబాద్, చండూర్, చిట్కుల్ గ్రామ శివారులో చెక్‌డ్యాంలు నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ విశ్వంభర స్వామి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, రైతు బంధు మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి, వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీదుర్గారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు మీన్నా ప్రసన్నరెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, జిల్లా రైతు బంధు సమితి సభ్యుడు సయ్యద్ హుస్సేన్, మండల కో ఆప్షన్ సభ్యుడు షఫీయొద్దీన్, నాయకులు మాణిక్యారెడ్డి, మధుసుదన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సర్పంచులు గోపాల్‌రెడ్డి, బుజ్జిబాయి, రాకేశ్‌నాయక్ స్వరూపా విఠల్, స్వాతి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.